## అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి, జూన్ 12: ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో అతిథి అధ్యాపక పోస్టులను తాత్కాలిక విధానంలో భర్తీ చేయడానికి అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గెస్ట్ లెక్చరర్ల కోసం 65 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న రిటైర్డ్, నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఫిలోసఫీ/సోషియాలజీ , సైకాలజీ, సైన్స్ పెడగాజి, సోషల్ సైన్స్ పెడగాజి, తెలుగు, ఆరోగ్య వ్యాయామ విద్య, విజువల్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఉర్దూ లాంగ్వేజ్‌లో ఒక పోస్టు చొప్పున, గణితం పెడగాజిలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలన్నారు. అభ్యర్థులు ఈనెల 19వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని, 21వ తేదీన తుది జాబితా ప్రకటించి, 24 నుంచి 26వ తేదీ వరకు మెరిట్ ప్రాతిపాదికన 1:5 నిష్పత్తిలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు జూలై ఒకటో తేదీ వరకు డైట్ కాలేజీలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని సూచించారు.

## రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలి

కోటగిరి, జూన్ 12: కొత్తగా పట్టాలు పొందిన రైతులు రైతుభరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా పట్టాలు పొందిన రైతులు రైతు భరోసా దరఖాస్తు ఫారంతోపాటు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా బుక్కు జిరాక్స్ కాపీలను ఈనెల 20వ తేదీ వరకు సంబంధిత ఏఈవోలకు లేదా వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

## మందులు అందుబాటులో ఉంచాలి

ఖలీల్‌వాడి, జూన్ 12: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని వై.రాజిరెడ్డి అధ్యక్షతన గురువారం నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ.. వానకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు, వైద్య సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక చికిత్స అందించేందుకు సిబ్బందిని నియమించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఓమయ్య, రాజన్న, రాజేశ్వర్, స్వరూపరాణి, నర్సింగరావు, రఘురాం, రంజిత్, సాయిలు పాల్గొన్నారు.

## సాగుదారులకు భూమి పట్టాలు ఇవ్వాలి

సిరికొండ, జూన్ 12: పేదలు, సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు పిట్ల రామకృష్ణ అన్నారు. మండలంలోని హుస్సేన్‌నగర్‌లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. హుస్సేన్‌నగర్‌లో గ్రామంలోని సర్వే నంబర్ 836లో 70 మంది పేదలు సుమారు 140ఎకరాల్లో సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, భుమాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు'

ఇందల్వాయి, జూన్ 12: శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ అన్నారు. మండలంలోని సిర్నాపల్లిలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మతపరమైన గొడవలు జరుగకుండా, గ్రామస్తులందరూ కలసిమెలసి ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు పడుతాయని హెచ్చరించారు. ఎస్సై సందీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనుల పరిశీలన

కంఠేశ్వర్, జూన్ 12: నిజామాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ గురువారం నగరంలోని పలు డివిజన్లలో పర్యటించి వంద రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య పనులపై కార్మికులకు పలు సూచనలు చేశారు. ఆయనవెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

# బైక్ చోరీ విషయం పోలీసులకు చెప్తాడని హత్య

### వసంత్‌కుమార్ మర్డర్ కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

వినాయక్‌నగర్, జూన్ 12: బైక్ చోరీ చేసిన విషయం పోలీసులకు చెప్తానని అనడంతో మిత్రుడినే హత్య చేశాడు ఓ కిరాతకుడు. నగర శివారులో జరిగిన మర్డర్ కేసుకు సంబంధించిన వివరాలను ఏసీపీ రాజావెంకట్ రెడ్డి గురువారం వెల్లడించారు. ఆర్యనగర్‌లో నివసించే దోషి వసంత్ కుమార్(38)కు గాజుల్‌పేట్‌లోని బురుడుగల్లికి చెందిన సర్దార్ తేజాసింగ్ పరిచయం ఉన్నాడు. ఈనెల 9వ తేదీన తేజాసింగ్‌కు డబ్బులు అవసరం ఉండడంతో, తన వద్ద ఉన్న బైకును వసంత్‌కుమార్ వద్ద తాకట్టు పెట్టి, రూ.3వేలు తీసుకున్నాడు. అనంతరం వారిద్దరూ కలిసి బోర్గం గ్రామ పరిధిలో మద్యం సేవించారు. బైకు పత్రాలు ఇవ్వాలని వసంత్‌కుమార్ అడుగగా.. అవి తన వద్ద లేవని తేజాసింగ్ తెలిపాడు. దీంతో అనుమానం వచ్చి.. ఇది దొంగిలించిన బైక్ అని.. విషయం పోలీసులకు చెబుతానని వసంత్‌కుమార్ అన్నాడు. ఆగ్రహించిన తేజాసింగ్ రాయితో వసంత్‌కుమార్ ముఖంపై కొట్టి హత్యచేశాడు. పరారీలో ఉన్న నిందితుడిని పోలీసులు గురువారం పట్టుకున్నారు. కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. బైకును గంగాస్థాన్ ఫేస్-2నుంచి చోరీ చేసినట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి రెండు సెల్‌ఫోన్లు, చోరీ చేసిన బైక్ స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన నగర సీఐ శ్రీనివాస్‌రాజ్, నాల్గో టౌన్ ఎస్సై శ్రీకాంత్‌తోపాటు సిబ్బందిని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి అభినందించారు.

## రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలి



రక్తదానం చేస్తున్న యువకులు

ఖలీల్‌వాడి, జూన్ 12: రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని సర్జన్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీవన్‌రావు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టి.నరేంద్ర కోరారు. సర్జన్స్ వారోత్సవాలను పురస్కరించుకొని అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, నిజామాబాద్ ఐఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హాల్‌లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆరోగ్యవంతులై 18-60 ఏండ్ల మధ్య వయస్సు ఉన్నవారందూ రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో నరేంద్ర, భాస్కర్‌రెడ్డి, రాకేశ్, రాజేశ్, శ్రీశైలం, ఆంజనేయులు, రాజశేఖర్, శాంతన్, మహేశ్, సునీల్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకులో చోరీకి యత్నించిన నిందితుడికి జైలు

### తీర్పు వెల్లడించిన జిల్లా జడ్జి కనకదుర్గ

వినాయక్‌నగర్, జూన్ 12: బ్యాంకులో దోపిడీకి యత్నించిన కేసులో నిందితుడికి ఏడు, ఐదేండ్ల చొప్పున రెండు జైలు శిక్షలు విధిస్తూ నిజామాబాద్ మొదటి అదనపు సెషన్స్ జిల్లా జడ్జి కనకదుర్గ గురువారం తీర్పు వెలువరించారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం దూపల్లి గ్రామానికి చెందిన ఆలూరి సంతోష్‌రెడ్డి ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామంలో స్థిరపడ్డాడు. 2024 జనవరి 1న రాత్రి సమయంలో దుబ్బాక గ్రామంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో చోరీ చేసేందుకు గడ్డపారతో షట్టర్‌ను ధ్వంసం చేశాడు. బ్యాంకులోనికి ప్రవేశించి సీసీ కెమెరాలు, స్ట్రాంగ్ రూమ్ హ్యాండిల్ ధ్వంసం చేశాడు. అదే సమయం లో అటువైపు వెళ్లిన కొందరు గమనించి బ్యాంక్ మేనేజర్‌కు విషయం తెలుపగా.. ఆయన డయల్ 100కు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని బ్యాంకులో దాగి ఉన్న సంతోష్‌రెడ్డిని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చారు. నేరారోపణలు రుజువు కావడంతో ఒక సెక్షన్‌లో ఏడేండ్లు, మరో రెండు సెక్షన్లలో ఐదు సంవత్సరాల చొప్పున జైలు శిక్షను విధిస్తూ జిల్లా జడ్జి కనకదుర్గ తీర్పు చెప్పారు. ఒక సెక్షన్‌కు వేయి రూపాయల చొప్పున మొత్తం మూడు వేల రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో మూడు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.

## దాడి కేసులో ఇద్దరికి 14 రోజుల రిమాండ్

వినాయక్‌నగర్, జూన్ 12: దాడి కేసులో ఇద్దరికి కోర్టు 14రోజుల రిమాండ్ విధించినట్లు త్రీ టౌన్ ఎస్సై హరిబాబు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన షేక్ అబ్దుల్‌గఫార్ గత నెలలో గంజాయి కేసులో పోలీసులకు పట్టుబడ్డాడు. తనను అదే కాలనీకి చెందిన వారు పోలీసులకు పట్టించారనే అనుమానంతో వారిపై కక్ష పెంచుకున్నాడు. బుధవారం రాత్రి తన మిత్రులు షేక్ ఆవేజ్, మహేశ్, సచిత్‌తో కలిసి పలువురిపై దాడిచేశారు. నిందితులపై కేసు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరుపర్చగా 14రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

## పేకాట స్థావరంపై దాడి

వినాయక్‌నగర్, జూన్ 12: నగర శివారులోని ఆరో టౌన్ పరిధిలో పేకాట స్థావరంపై బుధవారం అర్ధరాత్రి దాడిచేసి పది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకట్రావ్ గురువారం తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు శాస్త్రినగర్ పరిధిలోని మిర్జా జావీద్‌బేగ్‌కు చెందిన రేకుల షెడ్డులో జూదం అడుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.76వేల నగదు, ఒక కారు, రెండు బైకులు, 12 మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## సాయుధ దళాల పతాక నిధికి రూ.లక్ష విరాళం

కంఠేశ్వర్, జూన్ 12: కామారెడ్డికి చెందిన విద్యుత్ శాఖ రిటైర్డ్ ఉద్యోగి కృష్ణమూర్తి శర్మ భారత త్రివిధ దళాల పతాక నిధికి రూ.లక్ష విలువైన చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సైనిక సంక్షేమాధికారి రమేశ్ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కార్యాలయసిబ్బంది గంగామోహన్, ఉమేర్ పాల్గొన్నారు.

## బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు

డిచ్‌పల్లి, జూన్ 12: ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించేందుకు బ్యాంకు ఆఫ్ ఇండియా నిరంతరం కృషి చేస్తుందని ఆ బ్యాంక్ తెలంగాణ (ఎఫ్‌జీఎం, హైదరాబాద్) జనరల్ మేనేజర్ మనోజ్‌కుమార్ శ్రీవాస్తవ అన్నారు. మండలంలోని బర్ధిపూర్ శివారులోని ఓ హోటల్‌లో ఖాతాదారులతో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నిజామాబాద్, ఆర్మూర్, కామారెడ్డి, నిర్మల్ ప్రాంతాల్లో ఖాతాదారుల సంఖ్య పెంపు కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న రుణాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జోనల్ మేనేజర్ ముఖేశ్‌కుమార్, మెప్మా జిల్లా కో-ఆర్డినేటర్ మాధురి మాట్లాడారు. సమావేశంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ హితేంద్రకుమార్ శ్రీవాస్తవ, బ్రాంచ్ సీనియర్ మేనేజర్ వంశీనాథ్‌గౌడ్, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి సంగీత, నృత్య పాఠాలు

సుభాష్‌నగర్, జూన్ 12: జిల్లా కేంద్రంలోని శ్రీ జ్ఞాన సరస్వతి ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో శుక్రవారం నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ రవీందర్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవుల అనంతరం కళాశాల పునః ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

## గొడవ, దాడి కేసులో మహిళకు పదినెలల జైలు

వినాయక్‌నగర్, జూన్ 12: ప్రెషర్ కుక్కర్ విషయంలో గొడవ పడి మహిళను గాయపర్చిన కేసులో మరో మహిళకు 10 నెలల మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి భరత లక్ష్మి గురువారం తీర్పు వెలువరించారు. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన గణశెట్టి గంగవ్వ వద్ద అదే గ్రామానికి చెందిన ఎర్నాల సావిత్రి రెండు వేల రూపాయలకు ప్రెషర్ కుక్కర్ కొనుగోలు చేసింది. అది పని చేయకపోవడంతో బాగుచేయించి ఇస్తానని చెప్పింది. అయినా బాగు చేయించకపోవడంతో గంగవ్వ ఇంటికి వెళ్లి, గొడవపడి కమ్మకత్తితో దాడిచేసి గాయపర్చింది. నేరం రుజువు కావడంతో సావిత్రికి 10 నెలల మూడు రోజుల జైలు శిక్ష ఖరారు చేశారు. రిమాండ్ ఖైదీగా ఉన్న సావిత్రికి జూన్ 12తో గడువు ముగియనున్నది. రిమాండ్ కాలాన్ని కోర్టు శిక్ష కాలంగా పరిగణించిందని జడ్జి వెల్లడించారు.

## వ్యవస్థాపన దినోత్సవం..

రుద్రూర్, జూన్ 12: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ 61వ వ్యవస్థాపన దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. దీనిని రుద్రూర్ వరి చెరుకు పరిశోధనా స్థానంలో యూట్యూబ్ ద్వారా వీక్షించారు. పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ అంజయ్య, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిల్లలను సర్కారు బడిలో చేర్పించిన మాజీ సర్పంచ్

సారంగాపూర్, జూన్ 12: మడలంలోని నెహ్రూనగర్ గ్రామ మాజీ సర్పంచ్ అమానుల్లా ఖాన్ తన ఇద్దరు పిల్లలను సారంగాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో చేర్పించారు. ఇంతకు ముందు వారు ప్రైవేటు పాఠశాలలో చదువుతుండగా.. కొడుకు అల్తమాస్‌ను 8వ, కూతురు అక్సా ఫిర్దోస్‌ను 7వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో చేర్పించాడు. దీంతో అతడిని హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు శ్రీనివాస్‌గౌడ్, రవికుమార్, సాధుల నర్సయ్య, అనిల్, ఉపాధ్యాయులు ఘనపురం దేవేందర్, గోపాల్, రాధాకృష్ణ, గంగాధర్, కృష్ణంరాజు, స్వరూప, సుజాత, అనిత, లలిత, శ్రీలత పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

సిరికొండ, జూన్12: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ ఎదురుగా అసిస్టెంట్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహన పత్రాలు లేకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

ధర్పల్లి, జూన్ 12: రైతులు ఎక్కువగా రసాయన ఎరువులు వాడుతున్నారని, దీంతో పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్వేత అన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తే.. భూసారాన్ని కూడా కాపాడిన వారమవుతాయని చెప్పారు. మండలంలోని ప్రాజెక్టు రామడ్గు గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు', 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె సాగుబడి విధానాలు, సాగునీటిని ఆదా చేయడం, పంట మార్పిడి పద్ధతులు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. రైతులు ఎరువులు, పురుగు మందుల దుకాణాల నుంచి ఫర్టిలైజర్స్ కొన్నప్పుడు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని సూచించారు. శాస్త్రవేత్త పి. విజయ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి వెంకటేశ్, ఏఈవో మనోజ్, రైతులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాలి

కోటగిరి, జూన్ 12: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని యాద్గార్‌పూర్‌లో నర్సరీని ఆయన గురువారం పరిశీలించారు. ఎన్ని మొక్కలు ఉన్నాయని పంచాయతీ కార్యదర్శి సునందను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు.

## 'ఇందిరమ్మ' లబ్ధిదారులకు స్త్రీనిధి లోన్లు

భీమ్‌గల్, జూన్, 12: మండలంలోని మెండోరా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు గురువారం ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ స్త్రీనిధి లోన్లను అందజేశారు. గ్రామంలోని లబ్ధిదారులకు ఐకేపీ ఆధ్వర్యంలో స్త్రీనిధి పథకం కింద ఒక్కొక్కరికీ రూ.40 వేల చొప్పున ఇద్దరు లబ్ధిదారులకు రూ. 80 వేలను అందజేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించడానికి కృషి చేయాలన్నారు. ఆర్థిక సహాయం కోసం గ్రామంలోని ఐకేపీ సీసీలను గానీ, వీవోను గానీ సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రవీందర్, సీసీలు కుంట శ్రీనివాస్, పురస్తు నరేశ్ పీఎస్ ప్రశాంత్, వీవో అధ్యక్షురాలు హర్షిని పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

భీమ్‌గల్, జూన్, 12: కేంద్ర ప్రభుత్వ పథకాల్లో భాగంగా భూమి ఉన్న ప్రతి రైతూ గుర్తింపు కార్డు పొందడానికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ యూనిక్ ఐడీ కొరకు వ్యవసాయ శాఖ వద్ద నమోదు చేసుకోవాలని భీమ్‌గల్ మండల వ్యవసాయాధికారిణి పి.లావణ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. రైతులు తమ పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ ఉన్న ఫోన్ (ఓటీపీ కొరకు) తీసుకుని మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయానికి వచ్చి అన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

**PUBLIC NOTICE**

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Bheemgal Branch, Dist. Nizamabad agreed to accord Loan to **Borrower: Pothuganti Gangadas** S/o Pothuganti Gangaram, Age 48 Yrs, Occ:Business, R/o H.No.5-69/2, Chengal Village, Bheemgal Mandal, Nizamabad (Dist) on mortgage of the schedule referred plot property of **Pothuganti Prathyusha**. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **(07) days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

**SCHEDULE PROPERTY**

The Open Plot Lies in Survey No. 422/ఈ /1/1/2/1, admeasuring total site area **2721.20 Sq.Ft, Or 302.35 Sq. Yds, Or 252.80 Sq.Mtrs** Situated at CHENGAL Village of BHEEMGAL Mandal Dist: NIZAMABAD, Telangana State, within in the Grama Panchayath limits of CHENGAL, M.P.P. BHEEMGAL, Z.P.P.NIZAMABAD, Regn. Sub-Dist Bheemgal and Regn. Dist.Nizamabad, **AS BOUNDED BY :-** North :: G.P.Road South :: Open Plot of Pothuganti Prasanna, East :: Open Place of Kudi Cheruvu ,West :: Open Place of Pothuganti Chinna Gangaram

**Sd/- R.JAGADISHWER RAO,** Advocate
Subhashnagar, Nizamabad, Cell:9848094409

**PUBLIC NOTICE**

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nizamabad Branch-I, Dist.Nizamabad agreed to accord Loan to Borrower: **Narmala Ratnakumar** S/o Narmala Premaiah, Age 40 Yrs, Occ:Business, R/o H.No.1-88, Nadipally (V) Dichpally (M), Nizamabad (Dist) mortgage of the schedule referred property of **Narmala Premaiah** S/o Rajarathnam (Co-Borrower / Property Holder). The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.. Hence this notice.

**SCHEDULE OF THE PROPERTY**

The Existing R.C.C Roofed House, with Open place bearing G.P.No.(1-88), situated at Nadipally Village, Dichpally Mandal, Nizamabad (Dist), within the Grampanchayat limits of Nadipally Village, Regn.Sub Dist Rural and Regn.Dist Nizamabad.
**Total Area : (460.00)** Sq.Yds or **(384.60)** Sq.Mtrs RCC Roofed Plinth area **(586.50)** Sq.Fts
**As Bounded by :**North :: House of Nathiyala South :: Nizamabad to Hyderabad road ,East :: Schedule – D allotted to Fourth Party House and Open Place of Samson ,West :: Schedule – B allotted to Second Party House and Open Place of Sayamma

**Sd/- R.JAGADISHWER RAO,** Advocate
Subhashnagar, Nizamabad, Cell:9848094409

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈవో అశోక్



అంకాపూర్‌లో పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

జక్రాన్‌పల్లి/ మోర్తాడ్/ బాల్కొండ/ వేల్పూర్/ ముప్కాల్/ భీమ్‌గల్/ మాక్లూర్/ బోధన్ రూరల్/ సారంగాపూర్/ ఇందల్వాయి, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని లక్ష్మాపూర్‌లో గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. తిమ్మాపూర్ ఉన్నత పాఠశాలలో మోర్తాడ్ ఎంఈవో సమ్మిరెడ్డి, చౌట్‌పల్లి ఉన్నత పాఠశాలలో కమ్మర్‌పల్లి ఎంఈవో ఆంధ్రయ్యలు పుస్తకాల పంపిణీ కార్యక్రమాలను ప్రారంభించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కమ్మర్‌పల్లి కస్తూరిబా గాంధీ పాఠశాలలో విద్యార్థినులకు దుస్తుల పంపిణీని కమ్మర్‌పల్లి మార్కెట్‌కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంఈవో ఆంధ్రయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకెట రవి, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి గంగామణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. బాల్కొండ మండల కేంద్రంలోని వినాయక్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో బట్టు రాజేశ్వర్ ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఏపీఎం గంగాధర్, సీసీ విజయలక్ష్మి, సీఏలు పాల్గొన్నారు. వేల్పూర్ మండలం మోతె జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను హెచ్ఎం వైద్య గణేశ్ పంపిణీ చేశారు. ముప్కాల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తువులను అధికారులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్, ఎంఈవో జక్కుల రవికుమార్, హెచ్ఎం గంగారాం, ఏపీఎం ప్రసాద్‌రావు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు. భీమ్‌గల్ మండలంలోని బాబానగర్‌లో విద్యార్థులకు స్కూల్ యూనిఫాంను ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో స్వామి, ఏపీఎం రవీందర్, సీసీలు కుంట శ్రీనివాస్, పురస్తు నరేశ్, లలిత పాల్గొన్నారు. మాక్లూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఏఎంసీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు, హెచ్ఎం శ్రీహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సాలూర మండలంలోని తగ్గెల్లి ప్రభుత్వ పాఠశాలలో సాలూర తహసీల్దార్ శశిభూషణ్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. నిజామాబాద్ మండలంలోని మల్లారం, గుండారం గ్రామాల్లోని జడ్పీ హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో ఏకరూప దుస్తులను ఎంపీడీవో రాంనారాయణ అందజేశారు. ఐకేపీ ఏపీఎం మహేశ్‌కుమార్, హెడ్మాస్టర్లు రామ్మోహన్, సాయన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తహసీల్దార్ వెంకట్‌రావు, ఎంపీడీవో అనంతరావు, ఎంఈవో శ్రీధర్ కలిసి దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్ టౌన్, జూన్12: ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి విద్యార్థులకు అన్నారు. అంకాపూర్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మానందం, ఎంఈవో రాజగంగారాం పాల్గొన్నారు.

## చెట్టును తొలగించండి సారూ..



బోధన్ - మోస్రా రోడ్డుపై రెండు రోజులైనా తొలగించని చెట్టు

బోధన్, జూన్ 12: పెనుగాలులతో కూడిన వర్షానికి బోధన్ ప్రాంతంలోని అనేక చోట్ల సోమవారం రాత్రి చెట్లు విరిగి రోడ్డుపై అడ్డంగా పడ్డాయి. వీటిలో కొన్నింటిని తొలగించినప్పటికీ, కొన్ని చోట్ల వాటి తొలగింపులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బోధన్ - మోస్రా రోడ్డుపై రెండు రోజుల క్రితం చెట్టు విరిగి పడి రహదారిలో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అడ్డంగా ఉన్న ఈ చెట్టును తొలగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న ఈ చెట్టు కారణంగా రాత్రివేళ ప్రమాదాలు జరిగే అవకాశముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

## మున్సిపల్ రోడ్లకు మరమ్మతు

శక్కర్‌నగర్, జూన్ 12: ఐదు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా బోధన్ పట్టణంలో దెబ్బతిన్న రోడ్లకు మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేయిస్తున్నారు. బోధన్- వర్ని రహదారిలోని రైల్వేగేట్‌లో రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షం నీరు నిలిచి గుంతలు కనిపించకుండా పోయాయి. అనీల్ టాకీస్ రోడ్డు, శక్కర్‌నగర్ రోడ్డు కూడా గుంతలమయంగా మారాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులతో పాటు, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు మున్సిపల్ అధికారులు గురువారం ఈ రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. బోధన్‌లో వాననీరు నిల్వకుండా చూస్తున్నామని, పారిశుద్ధ్య సిబ్బంది, జవాన్లు, ఏరియాల వారీగా పనులు చేయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ తెలిపారు.

## డిగ్రీ పరీక్షా ఫలితాలు విడుదల

శక్కర్‌నగర్, జూన్ 12: బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్‌లో రెండో సెమిస్టర్ ఫలితాలను తెలంగాణ యూనివర్సిటీ సీవోఈ ప్రొఫెసర్ కె.సంపత్ కుమార్, శాంతాబాయిల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సురేశ్ తదితరులు విడుదల చేశారు. ప్రిన్సిపాల్ సురేశ్ మాట్లాడుతూ సెకండ్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను కళాశాలలో పొందుపర్చిన వెబ్‌సైట్‌లో చూసుకోవాలని, ఫస్ట్ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలకు మరో వెబ్ లింక్ ద్వారా చూసుకోవాలని వెల్లడించారు. డాక్టర్ డీకే రాజు, డాక్టర్ ఏ.బాబూరావు పాల్గొన్నారు.

## ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష

ఆర్మూర్‌టౌన్,జూన్12: పట్టణంలోని పెర్కిట్ శివారులో రాత్రివేళ నిర్దేశిత సమయం తర్వాత హోటల్ నిర్వహించిన యజమాని షేక్ అహ్మద్‌పై బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గురువారం తెలిపారు. గురువారం ఆయనను కోర్టులో మాజరుపర్చగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ నాలుగు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## యువకుడి ఆత్మహత్య

నవీపేట, జూన్ 12: అదృశ్యమైన యువకుడి మృతదేహం మండలంలోని మహంతం చెరువులో లభించినట్లు ఎస్సై వినయ్ గురువారం తెలిపారు. మండల కేంద్రంలోని శివాజీనగర్‌కు చెందిన మతి స్థిమితం లేని వగిరే విక్కీ(25) మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 9న కుటుంబ సభ్యులతో ఘర్షణ పడి ఇంటి నుంచి వెళ్లాడు. మహంతం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



కిసాన్‌నగర్‌లో ర్యాలీలో పాల్గొన్న అధికారులు

ఆర్మూర్‌టౌన్/ బాల్కొండ/ శక్కర్‌నగర్/ కోటగిరి/డిచ్‌పల్లి, జూన్12: పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలని డీడబ్ల్యూ రసూల్‌బీ అన్నారు. బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాటలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీడబ్ల్యూ రసూల్‌బీ హాజరై సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, ఎంపీడీవో, ఎంఈవో, ఏపీవో, ఆశ వర్కర్లు, పిల్లల తల్లులు పాల్గొన్నారు. ఆర్మూర్‌లోని మామిడిపల్లిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భార్గవి ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్లు వెంకటరమణమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. బోధన్‌లోని గోశాల రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో పలువురు చిన్నారులకు ప్రవేశం కల్పించారు. ఐసీడీఎస్ బోధన్ సీడీపీవో పద్మ సమక్షంలో పిల్లలను చేర్పించారు. సూపర్‌వైజర్ రాధికా రాథోడ్, గోశాల అంగన్‌వాడీ టీచర్ పుష్పలత, కళావతి, శ్యామలతో పాటు చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు. కోటగిరి మండలంలోని ఎత్తొండతోపాటు కోటగిరి, సుద్దులం, సుద్దులం తండా, యాద్గార్‌పూర్, బస్వాపూర్, లింగాపూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపిలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని మిట్టాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ బాట నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, విజయ, ఏఎన్ఎం రోజారాణి పాల్గొన్నారు.

## ఆలయంలో చోరీ

నవీపేట, జూన్ 12: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వెనుక భాగంలో రేణుక ఎల్లమ్మ ఆలయంలో బుధవారం రాత్రి చోరీకి జరిగింది. ఎస్సై వినయ్ కథనం ప్రకారం.. లింగం గుట్టలోని మోడల్ స్కూల్ వెనుక భాగంలో ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయంలో అర్చకుడు శేఖర్‌గౌడ్ రోజు మాదిరిగానే ఆలయంలో బుధవారం రాత్రి పూజ చేసి ఆలయానికి తాళం వేసి వెళ్లాడు. గురువారం ఉదయం ఆలయానికి వెళ్లి చూడగా గర్భ గుడి తలుపులు, తాళాల పగుల గొట్టి ఉన్నాయి. గుడిలోని సుమార రూ.లక్ష విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు తెలిపారు. ఆలయ అర్చకుడు శేఖర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

మోర్తాడ్/భీమ్‌గల్, జూన్ 12: భూ సమస్యలను పరిష్కరించేదుకే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రకాశ్ పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ శరత్ కుమార్, రైతులు పాల్గొన్నారు. భీమ్‌గల్ మండలంలోని పురాణీపేట్, పిప్రి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భీమ్‌గల్ తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్ మాట్లాడారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ మల్లేశ్, సాయాగౌడ్, స్వాతి, సీనియర్ అసిస్టెంట్ సృజన, సర్వేయర్ శ్రీనివాస్ గౌడ్, జూనియర్ అసిస్టెంట్ శారద తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రెంజల్, జూన్ 12: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెంజల్ ఎస్సై చంద్రమోహన్ సూచించారు. గురువారం రెంజల్ మండలం కల్యాపూర్ తదితర గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు అవగాహన కల్పించామని ఎస్సై పేర్కొన్నారు. పాత ఇండ్లు కూలిపోయే అవకాశం ఉన్నందున వాటిలో నివాసం ఉంటున్న వారు సురక్షితమైన ప్రాంతానికి వెళ్లాలని సూచించారు. వర్షకాలంలో మండల ప్రజలు విద్యుత్ స్తంభాలకు తాకవద్దని, వాన కురుస్తున్నపుడు చెట్ల కింద ఉండొవద్దని సూచించారు.

## బాలలపై హింసను అరికట్టాలి




సికింద్రాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

భీమ్‌గల్, జూన్ 12: బాలలపై జరుగుతున్న హింసను అరికట్టాలని బాల్య వివాహాలపై. బాల కార్మికులపై, బాలల అక్రమ రవాణాపై అవగాహన కల్పించేందుకు బాలల హక్కుల సాధన సంస్థ ఆధ్వర్యంలో గురువారం భీమ్‌గల్ మండలంలోని సికింద్రాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సాధన సంస్థ సీఎస్ ఎం. నిరీక్షణ, గ్రామ మహిళా సమాఖ్య సభ్యులు, సీఏ, మహిళలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మోర్తాడ్, జూన్ 12: కమ్మర్‌పల్లి మండలం ఆర్ఆర్‌నగర్ గ్రామంలో అదే గ్రామానికి చెందిన సరిగెల సాయిలుకు రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును స్థానిక నాయకుడు తిప్పిరెడ్డి శ్రీనివాస్ గురువాం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బద్దం రమేశ్, నర్సయ్య, శంకర్, దేవరాజము, నటరాజ్, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.